క్లుప్తంగా

14న మండల సమావేశం

పాడేరు రూరల్: మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి అధ్యక్షతన ఈనెల 14న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పరశురామ్ మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఆయనను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు వి.వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు బురిడి రామరావు, నాయకులు పాంగి నరసింగరావు, మహదేవ్, బాక సింహాచలం, చటారీ కృష్ణారావు, పి.నరేష్, పి.మోహన్, వి.బభిత, తుమ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

65 మందికి వైద్య పరీక్షలు


వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

హుకుంపేట: పంచాయతీ కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌సాయిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 65 మంది వైద్య పరీక్షలు చేసినట్టు ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది మహేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భూదాతలకు న్యాయం చేయాలి


దీక్ష కొనసాగిస్తున్న భూదాతలు

డుంబ్రిగుడ: మండలంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూమి ఇచ్చిన దాతలు చేపడుతున్న దీక్ష మంగళవారం నాటికి 20 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కోరుతూ 20 రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని వారు కోరారు. దీక్ష చేస్తున్న భూదాతలకు మాజీ ఎంపీటీసీ టి.రామదాసు, కాంగ్రెస్ నాయకుడు పరశురామ్ తదితరులు మద్దతు తెలిపారు. భూదాతలు రామ్‌చందర్, లైకోన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దయానంద సరస్వతి జయంతి


దయానంద సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం కిరణ్‌కుమార్

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరులో స్థానిక డీఏవీ పాఠశాలలో దయానంద సరస్వతి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కిరణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ దయానంద సరస్వతీ మహనీయుని ఆదర్శ మార్గంలో నడుచుకోవాలని కోరారు. వేద పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

నర్సీపట్నం : పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో బుధవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్తరవాహిని నదిలో స్నానాలు ఆచరించి పూజల్లో పాల్గొన్నారు. పూజలకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రోలుగుంట: గురుదేవుల దేవాలయానికి భక్తులు వేకువజాము నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. నిర్వాహకులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం భజన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

గిరిజన గ్రామాలు అనుసంధానం చేసేందుకు రహదారులు ఎంత ముఖ్యమో వాటితో పాటు వంతెనలు కూడా అంతే ముఖ్యం..అలాంటి వంతెనల నిర్మాణం పూర్తి చేయక.. పాడైన వాటికి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లోని అనుసంధాన రహదారులు, కల్వర్టులు, వంతెనలు అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం.. గిరిజనుల పాలిట శాపంగా మారింది.



చంపాపట్టి వంతెన లేక గెడ్డ దాటుతున్న గిరిజనులు

హుద్‌హుద్ తుపానుకు చంపాపట్టి వద్ద కొట్టుకుపోయిన వంతెన. (ఇన్‌సెట్) అసంపూర్తిగా ఉన్న కొర్రాయి వంతెన

అధికారుల నిర్లక్ష్యం.. ఇంకెన్నాళ్లు?



హుద్‌హుద్ తుపానుకు కూలిన చంపాపట్టి వంతెన | నేటి వరకు మరమ్మతుకు నోచుకోని వైనం | అసంపూర్తిగా కొర్రాయి వంతెనతో ఇక్కట్లు | వరదల్లో గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు | ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని యంత్రాంగం


డుంబ్రిగుడ: మండలంలోని శివారు గ్రామాలకు తుపానుల సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరద ఉధృతి తగ్గే వరకు గ్రామస్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏజెన్సీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను మంజూరు చేశారు. దీంతో దశాబ్దాల తరబడి కనీస సదుపాయాలకు నోచుకోని వందలాది గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణం జరిగింది. ఏజెన్సీలో మరింత అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం మరిన్ని నిధులు విడుదల చేసింది. అయితే ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయి.

అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాన్ని విస్మరించింది. మన్యంలో ఒక్క అభివృద్ధి పని చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన నిధులను కూడా వినియోగించడం లేదు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం.. గిరిజనుల పాలిట శాపంగా మారింది.

సా..గుతున్న పనులు

మండలంలోని పనసపుట్టు నుంచి శీలంగొంది వరకు సుమారు 10 కిలోమీటర్ల రహదారి ఉంది. ఈ మార్గంలో ఉన్న చంపాపట్టి వంతెన 2014లో హుద్‌హుద్ తుపానుకు కొట్టుకుయింది. నాటి నుంచి సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. శంకుస్థాపన పనులు కూడా జరిగాయి. అయితే పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

- మండలంలోని అరకు సంత నుంచి కొర్రాయి, కొల్లాపుట్టు మీదుగా ఒడిశా రాష్ట్రం పుక్కలి, పొట్టంగి, సిమిలిగుడ, కొర్రాపుట్టు వరకు వెళ్లే రహదారిలో కొర్రాయి సమీపంలో ఉన్న వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. రెండు రాష్ట్రాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా వంతెన లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేశాడు. ఎన్నికల కోడ్ రావడంతో మరలా పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది.


స్వర్ణాయిగుడ వద్ద మరమ్మతుకు నోచుకోని గొట్టాల వంతెన

- మండలంలోని గుంటసీమ బీటి రోడ్డు నుంచి కంద్రుమ్, సర్రాయి మీదుగా చటువా వరకు రోడ్డు సౌకర్యం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.6 కోట్లతో సర్రాయి – చటాయి వద్ద వంతెన నిర్మాణం జరిగింది. వందలాది గ్రామాలకు రాకపోకలు సజావుగా సాగుతున్నాయి.
- మండలంలోని స్వర్ణయిగుడ వద్ద చిన్న వంతెన ఉండడంతో కేవలం ఆటోలు, ద్విచక్రవాహనాలు తప్ప ఇతర వాహనాలు రాకపోకలు లేక రవాణాకు ఇబ్బందులు పడుతున్నారు.
- మండలంలోని పోతంగి పంచాయతీ లివిటిపుట్టు వద్ద ఉన్న వంతెన ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం వంతెన ఎత్తు తక్కువగా ఉండడంతో తుపానుల సమయంలో, వర్షాకాలంలో వరదనీరు ముంచెత్తడంతో సుమారు 36 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వంతెన మీదుగా లివిటిపుట్టు అరమ, లైగండ, తూటంగి, గుంటసీమ, రంగిలిసింగి పెదబయలు మండలం వరకు రహదారి సౌకర్యం ఉంది. లివిటిపుట్టు వద్ద ఉన్న వంతెన ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని పలు గ్రామాల్లో వంతెనలు, రహదారులు, కల్వర్టుల పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

“ అధికారులు స్పందించాలి


వంతెన నిర్మాణం చేయకపోవడంతో సుమారు ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ, అటవీ ఉత్పత్తులు సంతలకు తరలించేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చంపాపట్టి వద్ద కూలిన వంతెన స్థానంలో కొత్తది నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలి.
– **తాంగుల శత్రుగున్,** చంపాపట్టి గ్రామం, పోతంగి పంచాయతీ

“ వంతెన నిర్మించాలి


కొర్రాయి వద్ద వంతెన అసంపూర్తిగా ఉండడంతో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ప్రజలకు రవాణా కష్టంగా మారింది. అధికారులు స్పందించి ఈ రహదారిలో అసంపూర్తిగా ఉన్న వంతెనను త్వరగా పూర్తి చేస్తే రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అరకు నుంచి కొల్లాపుట్టు వరకు రోడ్డు ఉంది. ఇక్కడ వంతెన నిర్మిస్తే బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.
– **పంచాడి లలిత,** వైస్ ఎంపీపీ, కొర్రాయి పంచాయతీ, డుంబ్రిగుడ

అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయాలి

పాడేరు రూరల్: మండలంలో గొందూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం భవనం అసంపూర్తిగా ఉందని, దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని మండల పీసా కమిటీ కార్యదర్శి ఎస్.రామకృష్ణ చెప్పారు. గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానికులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం లేకపోవడంతో అద్దె ఇంట్లో నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 23 మంది ప్రీ ప్రైమరీ విద్యార్థులు, 8 మంది గర్భిణులు, 8 మంది బాలింతలు ఉన్నట్టు తెలిపారు. అద్దె భవనలోని అరకొర వసతి, తాగునీరు తదితర సమస్యలతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. వార్డు సభ్యులు దుర్గ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న పీసా కమిటీ సభ్యులు, గ్రామస్తులు

రైతులకు సూచనలు


దాలిపాడులో మాట్లాడుతున్న ఏవో ఉషారాణి

వై.రామవరం(అడ్డతీగల): ప్రతి రైతు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ఉషారాణి అన్నారు. దాలిపాడు గ్రామంలోని సచివాలయంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు జరుగుతుందని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు వ్యవసాయ సంబంధిత సేవలను సులభతరం చేయడానికి ఈ కార్యక్రమం అమల్లోకి వచ్చిందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర గ్రామంలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు బుధవారం పర్యటించారు. గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది విధులకు గైర్హాజరైనట్టు గుర్తించి, ఆరా తీయగా వారు ఫీల్డ్ విజిట్‌కి వెళ్లినట్టు తెలుసుకున్నారు. అయితే వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినపుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు పలు సూచనలు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.


కింద్ర గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీఈశ్వరరావు

పీసా చట్టంపై అవగాహన

అనంతగిరి(అరకులోయటౌన్): పీసా చట్టం అమలుపై ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళ సంఘం ప్రతినిధులు తదితరులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ ఆధార్‌కార్డు, ఆధార్ నంబర్‌కు అనుసంధానమై ఉన్న ఫోన్ నంబర్ ఉన్న ఫోన్‌తో హాజరుకావాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, సమావేశానికి హాజరైన వారికి మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ హజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమాలు జరగనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 14న అనంతగిరి, బొర్రా, టోకూరు, ఎగువశోభ, కొండిబా, పైనంపాడు, వాలసీ, లంగుపర్తి, గుమ్మ, కొత్తూరు, కాశీపట్నం, పెదబిడ్డ, చిలకలగెడ్డ పంచాయతీల్లో, 15న పెదకోట, పినకోట, కివర్ల, జీనబాడు, గుమ్మకోట, భీంపోల్, ఎన్.ఆర్. పురం, రొంపిల్లి, 18న బొర్రా, టోకూరు, ఎగువశోభ, కొండిభ, పైనంపాడు, వాలసి, లుంగుపర్తి, గుమ్మ, కొత్తూరు, కాశీపట్నం, పెదబిడ్డ, చిలకలగెడ్డ. 19న పెదకోట, పినకోట, కివర్ల, జీనబాడు, గుమ్మకోట, భీంపోల్, ఎన్.ఆర్.పురం, రొంపిల్లి, 20న ఎగువశోభ, టోకూరు, అనంతగిరి, బొర్రా, 21న పైనంపాడు, వాలసీ, గుమ్మ, లంగుపర్తి, 22న పెదబిడ్డ, కొండిబా, కొత్తూరు, గుమ్మకోట, 24న భీంపోల్, కాశీపట్నం, రొంపిల్లి, కాశీపట్నం పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధులకు, పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శులకు ఎంపీడీవో సమావేశ మందిరంలో శిక్షణ ఉంటుందని, ప్రతీ ఒక్కరూ విధిగా పాల్గొవాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు.

హుకుంపేట: మండలంలోని పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శులు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బందికి ఈ నెల 14 నుంచి 28వ తేది వరకు పీసా చట్టం అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరం, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పీసా కమిటీ ప్రతినిధులు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం

కొయ్యూరు/అడ్డతీగల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా జరుగుతుంది. కొయ్యూరు మండలంలోని పెదమాకవరం, నడింపాలెం, శరభన్నపాలెంలలో బుధవారం యూటీఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి ప్రచారం చేశారు. ఆమెకు మద్దతు తెలపాలని సీఐటీయూ నేత వై.అప్పలనాయుడు కోరారు. అడ్డతీగలలో ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రాజశేఖర్ ప్రచారం చేశారు. ఆయనకు మద్దతు తెలపాలని నాయకుడు రత్నాకర్ కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

పెదబయలు: మండలంలోని బొండాపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గోమంగి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చైతన్య కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాలలో 22 మందికి దగ్గు, జలుబు ఉందని, ఇద్దరికి వైరల్ జ్వరం ఉన్నట్టు గుర్తించి వారికి పరీక్షలు చేసి మందులు అందజేశామన్నారు. విద్యార్థులు రోజూ స్నానం చేయాలని, ఉతికిన దుస్తులు వేసుకోవాలని. ఆహారం తీసుకునే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, వ్యాయామం చేయాలన్నారు. గోరువెచ్చని నీరు తాగాలని, నిల్వ ఆహారం తీసుకోవద్దని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. బొండాపల్లి సబ్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బొండాపల్లిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చైతన్య

గిరిజన చట్టాలను పరిరక్షించాలి

రంపచోడవరం: ఏజెన్సీలోని షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతర సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టడం తగదని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు సంఘం తరపున ఓ వినతిపత్రాన్ని పంపినట్టు చెప్పారు.

ఇటీవల కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు గిరిజన చట్టాలను దెబ్బతీస్తున్నట్టు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా అల్లూరి, మన్యం పార్వతీపురం జిల్లాలో పవర్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం యోచించిందన్నారు. గిరిజన ప్రాంతంలో భూములను గిరిజనేతరులకు గాని గిరిజనేతర సంస్థలకు గాని కేటాయించడం చట్ట విరుద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేస్తోందన్నారు. గిరిజన చట్టాలను పరిరక్షించాలన్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య


సీతగుంటలోని రైతుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

పెదబయలు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని ప్రత్యేక గుర్తింపు నంబర్ పొందాలని మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. రైతులకు కేటాయిస్తున్న ప్రత్యేక రిజిష్టర్ సంఖ్య ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ రాయితీలు పొందవచ్చన్నారు. రైతులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో త్వరితగతిన నమోదు చేయించుకోవాలని సూచించారు.


రాజవొమ్మంగి సమావేశంలో మాట్లాడుతున్న మండల ఏవో చక్రధర్

రాజవొమ్మంగి: ప్రతి రైతు విశిష్ఠ గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారి చక్రధర్ కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతులకు గుర్తింపు సంఖ్య కేటాయింపు, అనుసరించాల్సిన విధివిధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రైతులు వచ్చి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

పాడేరు: ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ చెప్పారు. మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు.

ఆ సమయంలోని టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్‌లో ఉపాధ్యాయులు లేకపోవడంపై హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థినులకు ఆంగ్ల పాఠ్యాంశాలను బోధించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని హెచ్‌ఎంకు సూచించారు. వంట గదులతో పాటు స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. మరలాల తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఉపాధ్యాయులు లేకపోయిన, మెనూ ప్రకారం విద్యార్థినులకు ఆహారం పెట్టకపోయిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


విద్యార్థినులకు సూచనలిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

బస్సు సర్వీసు నిలిపివేతతో తప్పని ఇక్కట్లు

కొయ్యూరు: మహా శివరాత్రి, మాఘ పౌర్ణమి, రాజకీయ పార్టీల బహిరంగ సమావేశాలు తదితర సమయాల్లో బస్సు సర్వీసును రద్దు చేయడంతో స్థానిక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నర్సీపట్నం డిపోకు చెందిన నర్సీపట్నం-గంగవరం రూట్‌లో వెళ్లే బస్సులో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొయ్యూరు వస్తుంటారు. అయితే ఈ బస్సును నిలిపివేస్తుండడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొయ్యూరు ప్రభుత్వోన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు ఈ బస్సులోనే వస్తారు. బస్సు సర్వీసు నిలిపివేయడంతో బుధవారం కొయ్యూరు వచ్చేందుకు నానా అవస్థలు పడ్డామని ఆయా ప్రాంత ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.

శిథిలావస్థలో బస్‌షెల్టర్

- ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


సీలేరులో శిథిలదశకు చేరిన బస్ షెల్టర్

సీలేరు: సీలేరులోని మార్కెట్ రోడ్డులో ఉన్న బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి ఆరుబయట నిరీక్షించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్‌షెల్టర్ మరమ్మతు పనుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ గొడ్డేటి మాధవి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారని, పనులు చేపట్టేందుకు 2024లో ప్రతిపాదనలు వచ్చాయని, అయినా పనులు చేయలేదని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రావు, బుజ్జి , స్వర్ణలత, మోహనరావు, దొంబు, నూకరాజు తదితరులు చెబుతున్నారు. శిథిల బస్‌షెల్టర్‌తో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారితో పాటు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.